ఊరిబడి

వేలూరి శివరామశాస్త్రి

౧

తెలవాఱుజాము

పాలకుండలు నృత్యగీతవాద్యములతో మేజువాణి చేయు సమయమున తిరుమలాచార్యులు శ్రీ సంపాదించుటకు వడివడిగా బడికిఁ బరుగిడెను. రెడ్డిగారి అరుఁగుమీఁద బడి.

అతఁ డరుఁగెక్కి చూచెను. చీకటిలో ఏమియు నతనికి కనఁబడలేదు. అతఁడు గోడలు తడిమిచూచెను. ఎవరును లేరు. శ్రీ యాంతయు తనకే యిజారా అయినటు లతఁడు సంతసించెను. రెడ్డిగారికొడుకునుపిలిచెను. ఎవరును పలుకకుండుటచే అతఁడు కూరుచుండెను. శ్రీ మదము నెత్తికెక్కినటు లతనికి కునికిపాటులు వచ్చెను. నిద్రాదేవత అతనిని భూశయనము చేయించెను.

ఊరిచివరనున్న యొక యింటిలో జనార్దనము ఉలికిపడి లేచెను. చీకటులు పాఱిపోవుచు వెనుదిరిగి చూచుచున్నటు లుండెను. జనార్దనము శ్రీసంపాదించుకొనుటకు ఇంతకచ్చికను బలపముల సంచిలో నించుకొని నీరు సిరాబుడ్డిలో పోసికొని బడికిఁ బరువెత్తెను. కాని తన శ్రీ యంతయు దోఁచుకొని యొకఁడచటఁ బరుండి యుండెను.

జనార్దనమునకు ఒడలు మండిపోయెను. జనార్దనముకాలు తిరుమలాచార్యులమీఁద మూరెఁడెత్తు లేచి ఆఁగిపోయెను. అపు డతనికి ధర్మయుద్ధము చేయవలయునని సద్బుద్ధి పుట్టెను. ఎత్తినకాలు దించి జనార్దనము పలుదోమికొనుచుఁ గూరుచుండెను.

పలుదోముకొను సమయము ఆలోచనలకు పుట్టినిల్లుగదా! అతనికి అనేక-ఆలోచనలు కలిగెను. అతఁడాయాలోచనతో క్రిందట్టుమీఁదట్టయి యిట్లనుకొనెను. 'తిరుమలిగాణ్ణి తన్నఁగూడదు; యుక్తి పన్ని వీఁడి శ్రీ లూటీచెయ్యాలి.'

జనార్దనము కుఱ్ఱఁ డయినను మెచ్చుకొనఁదగినవాఁడు. ఏలయనఁగా సర్కారువారి పశుబలప్రదర్శనముకంటె ప్లీడర్ల బుద్ధిబలప్రదర్శనమునే యతఁడు స్వీకరించెను. ఆ బుద్ధిబలప్రదర్శనమును ముందు దర్శింతము గాక!

అంతట రంగమ్మ రోఁజుకొనుచు బడికి వచ్చెను. రెండుదయ్యము లా బాలికకచటఁ గనఁబడెను. అంత నా బాలిక తనయవ్వ ముద్దునకుఁగాను తనకు నేర్పిన కొన్ని సుశ్లోకములను ఆ యవ్వమీఁదనే రువ్వి కూలఁబడెను.

జనార్దనము దడదడగా సిరాబుడ్డితో ముఖము కడిగికొని వచ్చి—'రంగీ! నిన్న అటుకులు పెట్టలేదు కాదూ, చూస్కో- ఇవ్వాళ నీ చెయ్యి ఎల్లా పేలకొట తానో. నాది (శ్రీ). ఆపడకమోతుది చుక్క. నీది దెబ్బ. కాస్కో-' అనెను.

దెబ్బలుకొట్టు అధికారము ముందరగా వచ్చిన వానిది. జనార్దనము బాలురను మర్దించుటకు సర్దారు. అట్టి జనార్దన మిట్టు లనఁగనే రంగమ్మగుండెలు గుభేలు మనెను. ఆబాలిక అపు డేడ్వవలసిన యే డ్పిపుడేయేడ్చి 'నేనిహ బడి మానేస్తాను' అని యింటిదారి పట్టెను.

జనార్దన మిటు లనెను—'పోనీ కొట్టనులే. నాదే (శ్రీ) అని పంతులుగారితో చెపుతావా?'

రంగమ్మ రయిన వెనుదిరిగి యిటు లనెను—'(శ్రీ) నీది కాదా యేమిటి?'



"(శ్రీ) నీది కాదా యేమిటి?"

జనార్దనము రంగమ్మను తన అంతరంగకోటిలో చేర్చుకొని ఉన్న దున్నటులు చెప్పి — 'నీవు నాదే (శ్రీ) అని చెప్పు! ఆలా చెపితే ఈవేళే కాకుండా ఎప్పటికీ బెత్తం ఏత్తుగా ఎత్తి నీ చేతిమీఁద మెల్లింగా ఆనిస్తూ ఉంటాను' అనెను.

'నిజంగా?'

'నిజంగా.'

'భేష్. భేష్. అల్లాగే. నీదే (శ్రీ)అని చెపుతాను.

అంతట బాలు రొకరొకరే రాఁదొడఁగిరి. రంగమ్మ వచ్చిన ప్రతిబాలుని కడకును వెళ్లి జనార్దనముది; (శ్రీ) తిరుమలయ్యది చుక్క; నాది దెబ్బ అని చెప్పి తన సాక్ష్యమును వల్లించుకొనుచుండెను.

బాలు రందఱును వర్ణసాంకర్యము లేకుండ కలిసి దండించుచుఁ గూరుచుండిరి. జనార్దనము పలకమీఁద ఇటులు వ్రాయుచుఁ గూరుచుండెను:—

'జనార్దనము—(శ్రీ)
తిరుమలాయి—చుక్క
రంగమ్మ—దెబ్బ
ఊళక్కి—రెండు......'

ఇటులు క్రమక్రమముగా ఆపలక నిండుచు వచ్చెను.

౨

ప్రాతఃకాలము

కరకర ప్రొద్దు పొడిచెను. కర్మసాక్షి సాక్షిగా రావులపాటి రాజయ్య పంతులుగారు చెఱువుకట్టమీఁదఁ గూరుచుండి మూరెఁడుపుల్ల

"చెరువుకట్టమీఁదఁ......నోటఁబెట్టుకొని"

నోటఁ బెట్టుకొని జేనెఁడుచేసి అయిదాఱు చెంబులతో ముఖమండలమునకుఁ జేయవలసిన సత్కారము చేసిరి.

ఒడ్డున నున్న యొకదొడ్డిలోనికిఁ జని ప్రొయిలో నున్న విలువలేని యొకపదార్థముచే తమ ముఖమునకు విలువ కలిగించుకొనిరి. తూరుపుగా తిరిగి చేతులు దగ్గఱకుఁ దెచ్చి సూర్యుని ప్రార్థించిరి. పిమ్మట గజగమనముతో బడికి బయలుదేఱిరి.

తిరుమలాచార్యులు తన చేతిలోని పలకను లాగికొని చెఱిపివేయుటచే పశుబల ప్రదర్శనము కూడదనుకొనిన జనార్దనము చేతులే కాక దంతములుగూడ ఉపయోగింపవలసి వచ్చెను. జనార్దన ముపయోగించిన ఆయుధములే కాక తిరుమలాచార్యులు కలములను పలకలను ఉపయోగింపవలసి వచ్చెను. రంగమ్మ జనార్దనమునకు బాసటయై చేతికందిన దస్తరము లందిచ్చుచు పడెయ్ పడెయ్ అనుచుండెను. బడి యంతయు రెండు తెగలుగా చీలి వారి యిరువురకును జయనాదము లుగ్గడించుచుండెను. ఇటు లాపాఠశాల యంతయు సంతవలె నుండెను.

పంతులుగారు మెల్లగా వచ్చి ఖర్జూరపు ఆకుల చాఁపమీఁదఁ గూరుచుండి గోళాకారములయిన ఎర్రని గ్రుడ్ల నొకతూరి అటుత్రిప్పఁగనే ఆసంతయంతయు పుంతయై పోయెను. పంతులుగారిచూపు బడిలోని బాలురకే కాక ఊరిపెదలకుఁగూడ—' కాంతః క్రతు శ్చాత్రుషః.'

లా, ఆర్డరులు చక్కఁబడఁగానే బడిపెద్ద యగు ఎల్లమంద—

'సరస్వతి! నమస్తుభ్యం వరదే కామరూపిణి!
విద్యారంభం కరిష్యామి సిద్ధి ర్భవతు మే సదా.'

అని యొకొక్కపాదమే చెప్పఁగా మిగిలినవా రందఱును అనుపదించిరి.

రాజభక్తికీర్తన లప్పటి కెవరును కనిపట్టి యుండలేదు. గురుభక్తి కీర్తనలు కలవు కాని అవి గ్రంథములందును బెత్తములందును మాత్రమే కలవు. గతిలేక వా రిటులు సరస్వతిని ధ్యానించి నిమ్మకు నీరెత్తినటులు కూరుచుండిరి,

అంతట పంతులుగారు ఉత్తరీయపు కొంగుముడి విప్పి తాటాకులసంచినుండి ముక్కద్దములు తీసి కన్నులకు కళ్లెము తగుల్చుకొనిరి. బడియందలి పరమశాంతి వలన పంతులుగారు వచ్చిరని గ్రహించి పొరుగింటి నుండి పొన్నాడనాగయ్య మడిసంచితో వచ్చి కూరుచుండెను.

బడికి రాఁగానే రామకోటి వ్రాయుట పంతులుగారి మొదటిపని. నన్నయ్యకు నారాయణభట్టు వలె పంతులుగారికి నాగయ్య లేఖకుఁడు.

పంతులుగారి రామకోటి దస్తరము తెచ్చుట బండసుబ్బని పని. ఆబండసుబ్బఁడు గైర్‌హాజర్. పంతులుగారు వానికొఱకు చూడఁగనే జనార్దనము చూరులోని దస్తరము తెచ్చి నల్లనిరంగువేయఁబడిన ఆపుణ్యమును బయటఁబెట్టెను.

అంతట నాగయ్యయు నువ్వులు పఱచినటులున్న తన రామకోటిని విప్పెను. వా రిరువురును ఇటులు సిరాకాగితముల మితవ్యయముతో అనల్ప మగు పుణ్యశిల్పమును చేయుచుండిరి.

బాలు రందఱును మౌనముద్ర తాల్చి తమ ముఖరత్వమును హస్తపాదాదులతో నెఱవేర్చుకొనుచుండిరి. జనార్దనము మెల్లగా పాఱిపోయి బుడిపెలుగల ఈఁతబరికె చేతికి దొరకించుకొనెను. తిరుమలాచార్యులు బ్రరున లాగుకొనెను. (శ్రీ) ముక్కదెబ్బలకన్న వేఱయిన దొకటి తన చేతికి అంటుకొనుటచే జనార్దము కెవ్వమనెను.

ఆకేకచే నాగయ్య రామకోటిమీఁద అప్రయత్నముగా రామభక్తాగ్రేసరుఁ డయిన ఆంజనేయులవారి లంకాదహనమునాఁటి తోఁక యొకటి చిత్రింపఁబడి పోయెను. రివ్వున ఝుగ మెత్తఁగనే పంతులుగారి కళ్లెము పుటుక్కుమని తెగెను. బాలు రందఱును జరుగఁబోవు ప్రమాదమునకు వెంటనే జాగ్రత్తపడుటకు నిశ్చయించుకొనిరి.

పంతులుగారు మీసములలో చిక్కుకొనిన అద్దములను నేర్పుగా తీసికొనకముందే జనార్దన మిటులనెను—'నాది (శ్రీ) అయితే తిరుమలాయిబెత్తం లాక్కుంటున్నాఁడు చూడండి.'

జనార్దనము తనను సాక్ష్యము కోరకముందే రంగమ్మ లేచి తనసాక్ష్య మప్పగించెను. పంతులు ముక్కద్దములు క్రిందఁబెట్టి—'ఆమాట నిన్నెవ రడిగారు? ముందు ని వ్విట్లారా' అని చూపుడువ్రే లాడించెను. రంగమ్మగుండెలు కొట్టుకొనెను. రంగమ్మనిలువఁబడినచోటనుండి ఒక యంగుళ మేని కదలలేదు. 'రమ్మంటే రావేం' అని పంతులు కాండ్రు మనెను. రంగమ్మ బేరుమని కూర్చుండెను.

ఇట్టి ఆరాచకపు సమయములందు స్త్రీలకుఁగూడ పోలీసుఉద్యోగములు తరతరముల నుండియు హక్కుభుక్తములలో నున్నవి. కావున ఆ బాలికకు దాపటను వెలుపటను ఉన్న ఇరువురు బాలికలు చట్టసమ్మతముగా రంగమ్మచట్టలక్రింద చేతులువేసి శ్రీకృష్ణభగవానులు కుబ్జకుఁ జేసినపని చేసిరి. పిదప తమ హక్కులో కీసపాలేని పోఁగొట్టుకొనకుండ రంగమ్మను ముందులకు నడచునటులు చేయఁదొడఁగిరి. కాని పంతులుగారి తేజస్సు ఆనడిపించువారి శక్తికంటె దొడ్డది. అది రంగమ్మను వెనుకకు నెట్టఁజొచ్చెను. దానివలన రంగమ్మను Custody లో ఉంచుకొనినవారు వెనుకకును ప్రక్కలకును చెదరిపడుచుండిరి. ఈరీతి వానావానావల్లప్పతో వారు మూపురును వర్ణసాంకర్యము కలిగించి కొందఱు మఠమలమీఁదుగా రస్తావేసి నాగయ్య రామకోటిమీఁదను శరీరముమీఁదను సిరా చిమ్మి దేవుని దయవలన తమకుమాత్రము దెబ్బ తగులకుండ నాగయ్యను శయ్యగాఁ జేసికొనిరి. ఉపాధ్యాయులవారు సాహసించి ప్రక్క అరుఁగుమీఁదికి లంఘించిరి. ఏలనఁగా వారపుడు రామకోటి మడిలో నుండిరి. మైలపడిన తరువాతఁగాని వారిని శిక్షింపవీలులేదు.

బాలికలు తనమీఁద పడినందులకు నాగయ్య యిసుమంతయు కినియలేదు! కాని తానును రామకోటియు మైలపడుటవలన నతఁ డపు డుపయోగించిన మాటలు ఎన్నఁడును విన్నవి కావుకావున బాలు రందఱును పంతులుగా రున్నారను మాటగూడ మఱచి పొట్టలు చేతులతోఁ బట్టుకొని పకలఁబడఁగనే నాగయ్య రామకోటితో చెఱువుకుఁ బరువెత్తెను.

ఒకయపరాధమున కిటులు రెండుమూఁడుపిల్లలు పుట్టుటచే తాము మైలపడకుండ పంతులుగా రాబాలికను బెదరింపఁదలఁచి ఈఁతబరికెకొనను ఎడమచేత సవరించి ఫళ్లు మనిపించిరి. బెత్తము తాఁకకముందే రంగమ్మ బావురుమని వెనుకకు విఱుచుకొనిపడి తనను పట్టుకొనినవారికిఁగూడ ఆయుత్సవమున భాగము పంచిపెట్టెను. ప్రక్కలపడిన బాలికలు రివ్వున లేచి తమబలమును ఇతోఽధికోత్సాహముతో ప్రకటింపఁగనే రంగమ్మ—'జనార్దనం తనదే (శ్రీ) అని చెప్ప మన్నాఁడండి.' అని అనెను. ఈమాటలు వినుచు జనార్దనము రంగమ్మమీఁద నిప్పులు కురిపించెను.

'ఏమిరా జనార్దనమ్! ఈమాట నీవన్నావాలేదా?' అని పంతులుగా రడిగిరి.

'ఉత్థది, ఉట్టిది.'

'అయితే ఇంతకూ (శ్రీ) యెవరిది?'

'నేను ముందొచ్చి పళ్లుతోముకుంటుంటే తిరుమలాయి వచ్చి దిద్ద రోయాఁడండి' అని జనార్దన మనఁగనే తిరుమలాచార్యులు లేచి—'అల్లాయితే నేను రాంగానే ఏంచేశానో చెప్పు' అనెను! జనార్దనమిపుడు బుద్ధిబలము నుపయోగించుటకు ఆలోచింపఁదొడఁగెను. దాని కందఱును వెంటనే సంతసింపఁదొడఁగిరి.

'నీదే (శ్రీ)' అని పంతులుగారు ఈ నిర్ణయముతో బడిని ఆపూఁటకు ముగించి అందఱును చలిదియన్నమునకుఁ బోవ నియమించి రామకోటిని పూర్తి చేయుటకుఁ గూరుచుండిరి.

పంతులుగారొకటి రెండుమాఱులు వీథిలోనికి వచ్చి చూచిరిగాని నాగయ్యదర్శనము లేదు. పిలిచిరిగాని పలుకులేదు. ఇటులు నిస్సహాయులై వారొకరే మెల్లమెలగా తమవిధిని అనుష్ఠింపఁదొడఁగిరి.

౩

మధ్యాహ్నము

బాలబాలిక లందఱును అన్నము తిని జట్లుగను ఒంటియొంటిగను వడివడిగా బడికి బయలుదేఱిరి. ఏలనఁగా శ్రీచుక్కలరహస్యమును తెలిసికొనుటకు వారినోరూరుచుండెను.

ఈపూఁట వారికి సామాను ఎక్కువ. ఎడమచేత నొకకొయ్యపలకయు పెద్ద - లేక చిన్న - బాలశిక్షయు. కుడిచేతిలో సెనగపప్పో కందిపప్పో అటుకులో యేదేనొక తినుబండము, వెనువెంట భూమిమీఁద నాలుగయిదు కుక్కలు, ఆకాశమున పది పదియేనుకాకులు.

అపుడు నాగమ్మ ముష్టియెత్తుకొనుట ముగించి కఱ్ఱపొడుచుకొనుచు ఇంటికిఁ బోవుచుండెను. నాగమ్మకెనుబదియేండ్లు. ఆమె తనమగని నెఱుఁగదు. కాని ఆమె తనమగని గుఱుతుగా క్రిందటి యేఁటివఱకును తలవెండ్రుక లుంచుకొనెను. నాగమ్మ తనమగనిగుఱుతును విడిచి యిటులు సనాతనమత మవలంబించిననాఁటనుండియు 'కొబ్బరికాయ'అనుబిరుదు వడసెను. ఇట్టి నాగమ్మ విద్యాబుద్ధులను నేర్చికొనుటకు బడికరుగుచున్న యీ బాలురను చూచీ చూడనటులు చూచి తలకొంగు ముందరికి లాగికొనుచు వడివడిగా అడుగులు వయిచెను.

నత్తినాగులు పానకాలును లాగి—'కొ కొ కొబ్మరి ముక్క పెట్టవుగా?' అని ధాటిగా అడిగెను.

'కొబ్బరి యేడుందిరా? చెనగలు' అని పానకాలనెను.

ఈబిరుదు వినఁబడఁగనే నాగమ్మ కాంగ్రముమనకుండుట అరుదు. అయినను ఆమె మొదటితప్పును క్షమించెను.

దవ్వుగా నున్న పర్వతాలు 'కొబ్బరికాయ కొబ్బరికాయ' అని అఱచెను.

'నీ తలకాయగల' అని నాగమ్మ నోరువిప్పి నిఘంటువులలో లేని కొన్ని సుభాషితములను ప్రచారములోనికి తీసికొనిరాఁగనే బాలబాలికలందఱును గలసి—

'నాగమ్మనాగమ్మ-బోడినాగమ్మా!
నాగమ్మతలకాయ-కొబ్బరికాయా!'

అని పాడి తమకవితాప్రతిభను వెల్లడించిరి.

నాగమ్మ ఊరకుండలేదు. కనుచూపు మేరలో దేవుఁడిచ్చిన ఆయుధములను ప్రోగుచేసి ఈమెనుబదవయేఁటఁగూడ తన కఠోరవైధవ్యమునకు ఫలితమయిన లక్ష్యసిద్ధిని బాహుశక్తినిగూడ బాలు రందఱకు నగపఱిచెను. ఇటులు నాగమ్మముద్దరలు తిని వా రందఱును బడికిఁ బరుగెత్తుకొనిపోయిరి.

పంతులుగా రపుడే రామకోటిని ముగించుచు— 'బండసుబ్బఁడు రాలేదా?' అని అడిగిరి. 'రాలేద'ని వినఁబడఁగనే బండసుబ్బఁడు చేయవలసిన పనులను పానకాలుకు అప్పగించిరి.

బండసుబ్బనిపని తనకు దొరకఁగనే పట్టరాని సంతోషముతో పానకాలు పొగాకుపట్టాకడకు పరుగెత్తెను. అది నిండుకొనియుండెను. పానకా లదిచూచి గంతువైచెను. ఏలయనఁగా గురుభక్తి తెలుపుట కది సుసమయము. పానకా లిటులు తమ దుకాణమునకు పరుగుతీయఁగనే బాలు రొకరొకరే పలకలతో వచ్చి పంతులుగారిముందు నిలువఁబడిరి. పంతులుగారు ఒకొక్కపలక పుచ్చుకొని—

క. ఇంతలు బదరీఫలములు
ఇంతలు మారేడుబండ్లు ఈడుకు జోడా...'

అని చదివికొనుచు బాలబాలికల కనుగుణముగా ఒరవడి పెట్టి పంపుచుండిరి. కొంతవడి కాపని ముగియఁగనే చింతబెత్తము తెప్పించి దాని మొదలును సూదిపలె చెక్కి పంతులుగారు జనార్దనమును తిరుమలాచార్యు

లను దాపునకుఁ బిలిచి—'శ్రీ యెవరిది?' అని అడిగిరి.

జనార్దనము బెదరుచు 'నాదే' యనెను, తిరుమలాచార్యులు 'నాది' అని ఖంగున పలికెను.

'వెధవా! నీ దెట్లా అవుతుంది? నిద్దరలో నీశ్రీ జనార్దనం కొట్టుకోపోయాఁడు' అని పంతులు జనార్దనము - అఱచేతిని తనయెడమ అఱచేతిమీఁద పెట్టించి బెత్తము మొదలును లోఁగడనే చీరుకొనిపోయి యున్న అఱువడిలో గ్రుచ్చి, యెన్నఁటికిని మాయని శ్రీ పెట్టిరి. పిదప 'నీకు శ్రీకావలెనా?' అని తిరుమలాచార్యుల నడిగిరి. 'వద్దు' అని అతఁ డనఁగనే అతని చేతికిఁ గలిగిన స్పర్శవలన ఆనాఁడు శ్రీకంఱె చుక్కయే దొడ్డ దని అతఁడు తెలిసికొనెను. పిమ్మట రంగమ్మ చేయి శ్రీలో సగముసౌఖ్య మనుభవించెను. పిమ్మట దెబ్బలుకొట్టునధికారము తిరుమలయ్యకు సంక్రమించెను.

పానకాలు దిగ్విజయము చేసికొనివచ్చి తిరుమలాచార్యులదెబ్బలకు అతీతుఁడై ఒకమూల కూరుచుండి కాలిబొటన వ్రేలిలావునను జేనెఁడు పొడవునను చుట్టలు చుట్టి గురుదక్షిణ యిచ్చెను. పంతులు సంతసించి 'పొగాకు ఎక్కడిది?' అని అడుగఁగనే ఆప్రశ్నకే మొగము వాఁచుకొనియున్న పానకాలు 'మాదుకాణము లోనిదే చాటుగా తెచ్చాను' అని హస్తకౌశలమును తెలుపుకొనెను.

'ఎక్కడిసరుకు?'

'కిష్టయ్యగారి పాటితోఁటలోది'

'గుమ్మడితోఁటలో దేమయినా పట్టమ్మని బంద సుబ్బడికీ చెప్పాను నీకూ చెప్పాను. ఏంలాభం?'

'వీడితో మీరు చెప్పలేదండీ; పానకాలుకు చెపితే ఇన్నాళ్లా'

'సరేలే రేపు చూడు; అయితే ఇందులో నీవేమీ దాఁచుకోలేదుగద?'

'లేదండీ లేదండీ' అని పానకాలు లేచి బట్టలు దులిపి నగ్నమయినసత్యమును ప్రకటింపఁగనే పంతులుగారు చుట్టను నోటఁబెట్టుకొనిరి. రెడ్డిగారి కుమారుఁడు ఇంటిలోనికిఁ జని కొఱవి తెచ్చెను. పానకా లిత్తడిచెంబిచ్చెను. పంతులుగారు మాధ్యాహ్నికమునకు వెళ్లిరి.

పొన్నాడనాగయ్య చెఱువునుండి యింటికి మరలి మఱచివచ్చిన సిరాబుడ్డికి బడిముందరకు వచ్చెను. పంతులుగారు లేరని తెలిసిపోయెను. అట్టి సమయమున తానచటి కొంటరిగా వెళ్లుట తనకును తన సిరాబుడ్డికిని అంత క్షేమమయినపని కాదనుకొని అతఁ డింటికే వెళ్లిపోయెను.

సాయంకాలము

బడిచిన్న యగు బొపులు తొంగిచూచి చేతులు త్రిప్పి కంఠమును అడఁచుకొని అడఁచుకొని ప్రకటించిన స్వరవిశేషముచే పంతులవారు వచ్చుచుండి రని అందఱకును తెలిసెను. అంతట బడియంతయు గప్‌చిప్ అయిపోయెను.

భుక్తాయాసమును మడిచుట్టచే పోఁగొట్టుకొనుచు పంతులుగారు అరుదెంచిరి. కరసహకారముచే కాల్చునది మైలచుట్ట. ఎంగిలి కాకుండ అంగిటిలోనికి విసరివేసికొనునది మడిచుట్ట, వారిమడిచుట్టను మడిగానే విసర్జించి తాము తెచ్చికొనిన చెంబెఁడు నీటితో గళక్ గళక్ మనిపించి లోనికి వచ్చిరి. పానకాలు చాఁప దులిపి గడ్డిదిండుతో అయ్యవారికి శయ్య యేర్పఱచెను. పంతులుగా రుత్తరీయము పఱవఁగనే అందఱును ఇండ్లకు వెళ్లిరి. పంతులుగారు కనులు మూయఁగనే మూలుగుచున్న నిద్రాదేవి వారి నావేశించెను. వారు గుర్రుకొట్టుచు నిదురించిరి.

పంతులుగారి ఉదరగోళమునుండియో లేక దహరాకాశమునుండియో కాని తిత్తిమ్రోఁతలు బయలుదేఱి రాటపుమ్రోఁతలుగా మాఱుదొడఁగెను. రెడ్డిగారి యింట దూది యేకించుచుండి రనుకొని దూదేకుల

సాహెబు కొలకు కొందఱు వచ్చి హతాశులయి వెళ్లిరి. నడుమ నడుమ రాయియు రాయియు కొట్టుకొనినటులును మబ్బు లుఱిమినటులును వినఁబడఁదొడఁగెను. కొంత వడికి ఈధ్వను లన్నియు ఆఁగిపోయెను. శ్వాస యంత్రమగు పుప్ఫుస మొకింత విశ్రాంతి దీసికొనెను.

పంతులుగారి కపుడు పరివర్తనైకాదశి. వారు ఈప్రక్కనుండి అప్రక్కకు పొరలిరి. మఱియొక నిమిషములో విచిత్రధ్వని యొకటి బయలుదేఱెను.

రెడ్డిగారియింట తన యిజారాలో నున్న పాల కుండలను కొల్లగొట్టుటకు వచ్చి తనజాతిలోని దొకటి తనను ధర్మయుద్ధమునకు రమ్మని గర్జించుచున్నదేమో యని తలఁచి గోడమీఁదినుండి గండుఁబిల్లి యొకటి అమాంతముగా పంతులుగారి ప్రక్కకు దూఁకెను. పాప మాపిల్లి భూమ్యాకాశములు వెతకెను. తన దినుసెచటను లేదు. అది యంతట విస్తుపోయి ముంగాళ్లమీఁద నిలిచి పంతులుగారి ముఖమును నిరీక్షించుచుండెను.

అంతలో ఆధ్వని మాఱెను. పిల్లి ఆత్మరక్షణ మొనర్చుకొనుటకు కస్సుమనెను. కాని దాని విరోధి జంతువు దానికి కానరాలేదు.

రెడ్డిగారి యింటికుక్క యింటి నాలుగుమూలలు పరికించి వచ్చెను. దాని జూచి పిల్లి చెంగున గోడమీఁది కెగిరెను.



“ దానిజూచి పిల్లి చెంగున గోడమీఁది కెగిరెను ”

మొర మొరగాఁబెట్టి ఆకుక్క పంతులుగారిని జూడఁదొడఁగెను. ఉఁహుఁ. దానికిని ఈముడివిడలేదు. తుదకది మొర ఆకసముమీఁది కెత్తి పంతులుగారి ధ్వనితో తనధ్వనిని అప్రయత్నముగా కలిపెను.

బాలు రొక రొకరేవచ్చి యీకుక్కను బయటికిఁ గొట్టిరి. క్రమక్రమముగా అరుఁగు నిండెను. అంత పంతులుగారేమియు నెఱుఁగనటులు లేచి ‘పిల్లలంధఱూ వచ్చారా ?’ అని యడిగిరి.

బడిపెద్దయగు ఎల్లమందలేచి—‘బండసుబ్బఁడు, నత్తినాగులు, ఉళక్కి, పాతాళంగాఁడు, పర్వతాలు, జనార్ధనంగోరు, రంగమ్మగోరు, చుక్కమ్మ, సుబ్బి [వీరిరువురును రంగమ్మను నెట్టుకొని వచ్చినవారు. ప్రొద్దునఁ గలిగిన హైరాణికి వీరిపూఁట గైర్‌హాజర్] వీరు రాలే’ దని చెప్పెను.

వీరిని పట్టి తెచ్చుటకు వెంటనే హుకుమాయెను. అబద్ధాలు, సత్యం, గున్నయ్య మొదలగు కొందఱు యోధులతో ఎల్లమంద దాడివెడలెను.

జనార్దనముతంత్రీ వారితో నిటులనెను—‘బర్లోకి ఈపూఁట జనార్దనమే కాదు, నేనూ రావాలి; పంతులు గారి సంగతి కనుక్కోవాలి.’

ఈయోధుల కీమాటలు చాల ఆశాజనకము లాయెను. కాని అబద్ధాలిటు లనెను— ‘ఈ పెద్దాముండావాళ్లు ఇల్లాగే అంటారు కాని చివరకి వాళ్లు పంతుళ్లను కనుక్కోక పోవటం అటుండంగా బర్లోకిపోవేమని తామే మళ్లా పిల్లల్ని కఱచుచ్చుకుని వెంటడతారు?’

అంతట వారు బండసుబ్బనికొఱకరిగి దుకాణముమీఁద నున్న గుఱివిసెట్టిని జూచి అతని మరియాదను, తమ మరియాదను నిలువఁబెట్టి — ‘సుబ్బిసెట్టి యేఁడీ ?’ అని యడిగిరి.

'బళ్లో బండకొయ్యలో కూకున్నాఁడేమో అనుకున్నాం. అన్నంకూడా తినలేదు నాయనలారా! కొంచెం వెతకిపెట్టండి' అని గురివిసెట్టి యనఁగనే వారందఱును ఒకరినొకరుచూచికొని వీథిలోనికి వచ్చి ఒకచిన్న సభ చేసి రెడ్డిగారి మామిడితోఁటలోనికిఁ బోయి చూచిరి. తోఁటమాలి లేఁడు. మావిపిందె లపుడపుడే ముదురుచుండెను. వారందఱును చెట్లెక్కి యింకొక్క పదార్థమును నమలుటకు వీలుకలుగకుండఁ జేసికొని దిక్కులు చూచుచుండిరి.

'అడుగో బండసుబ్బఁడు' అనియెల్లమంద యనెను. 'ఎక్కడెక్కడ?' అని అయిదాఱు కంఠములు మ్రోఁగెను. 'అడుగో గుమ్మడితోఁటనట్టనడుమ!'

అందఱును క్రోఁతులవలె క్రిందికి దిగిరి. వంగి కొంతదవ్వును, కూర్చుండి కొంతదవ్వును, పొట్టమీఁద ప్రాఁకి కొంతదవ్వును వెళ్లిరి.

గుమ్మడితోఁట యను పేరుగల ఆపొగాకు తోఁట చక్కగా పిలకతొడిగెను. గురుభక్తి గల బండసుబ్బఁడు ఎన్నికయగు నాకు నేతి ఒకొక్క ఆకే కోయుచుండెను. అపు డయిదాఱు శరీరములు తన మీఁదఁ బడుటచే నతఁడు తోఁటకాఁపులనుకొని రెండు విదిలింపులు విదిలించెను. ఈయోధులందఱును తోళ్లవలె నేలకుఁ గఱచుకొని లేచి—'చూసొ్క అయ్యవారికి చెప్పకపోతే' అని అదలింపఁగనే అతఁడు సులభముగా లొంగిపోయెను.

పిమ్మట బండసుబ్బఁడు కోసిన యాకును పచ్చి తాటాకునఁ గట్టుకొని తానును ఒకయోధుఁ డాయెను వీరందఱును కలిసి వెళ్లి బల ముపయోగింప నక్కఱలేని బక్కవారిని వెంటఁ బెట్టుకొనియు, ఉక్కుముక్కల వంటి ఉళక్కి మొదలగువారికి పాదబల ముపయోగించుచు ముందుంచుకొనియు బడికి నడచిరి.

చెప్పచున్న రంగులపద్యముల నాఁపివేసి పంతులుగారు బండసుబ్బని బహుమతిని స్వీకరించి మిగిలిన వారికి గోడకుర్చియో, బండికొయ్యయో, కోదండమో, నిలువుజీతమో యేదియో యొకబహుమతి నొసఁగిరి.

అంతట బాలు రెక్కములుచెప్పటకు లేచిరి. అపుడు గ్రామములోనివా రొకరిద్దఱు వచ్చి పంతులుగారిచే దస్తావేజులు వ్రాయించుకొనిరి. అది ముగియఁగనే పంతులుగారు లేచి—

దీపం జ్యోతిః పరంబ్రహ్మ దీపం జ్యోతిః పరాయణమ్;
దీపం హరతు మే పాపం సంధ్యాదీప! నమోఽస్తుతే.

అని చెప్పి బాలురచే చెప్పించి కూరుచుండిరి. వారి కిది రెడ్డిగారి కాతాౘ్రాయు సమయము.

బాలు రందఱును వెళ్లిపోయిరి కాని జనార్దనమును వెంటనిడుకొని అతనితండ్రి యెపుడు వచ్చునా యని అబద్ధాలుకాక కొందఱు బాలురు వీథినిచూచుచు వెళ్ల లేకవెళ్ల లేక యిండ్లకు వెళ్లిరి.